# సెంట్ బాటిల్

ఆరోజు సాయంత్రం దీపాల వెలుగులో సెంట్ బాటిల్ కొంటున్నప్పుడు నాకు చాలా ఉల్లాసంగా ఉంది. ఉల్లాసంగా ఉంది కానీ మనసులో ఏదో భీతి కూడా దాక్కునే ఉంది. హు! మానవమాత్రులం కదా! కప్పుకీ లిప్పుకీ మధ్య ఎన్నో గాలి దుమారాలు. కనపడని అగాధాలు.

''ఈసారైనా నా ప్రేమ ఫలించేటట్లు చూడు దేవుడా'' అనుకున్నాను. ఎప్పుడూ మనసారా పూజించని దేవుణ్ణే గుర్తు చేసుకుంటూ.

ప్రేమ! ప్రేమ! ప్రేమ... ఈ పదం లేకుండా ఏ జీవితం నడవదు.

ఆ మాట విన్నా వినకపోయినా, దానికి అర్థం తెలిసినా తెలీకపోయినా జీవితంలో ఆ మాటకి అవినాభావ సంబంధం వుంది.

అదేం ఖర్మమో, ప్రేమలో వైఫల్యాన్నే రుచి చూశాను కానీ సాఫల్యాన్ని పొందలేదు నేను! అందుకే ఈ భీతి. ఈ సారైనా... అని వేడికోలు.. నిరాకారుడు నిర్గుణుడు ఐన ఆ సర్వాంతర్యామికి.

సంతోషంలో నిట్టూర్పును రంగరిస్తూ సెంటుబాటిల్ని ఆప్యాయంగా జేబులో పెట్టుకున్నాను. అనంత ఇంటికి బయలు దేరాను.

అనంత! అనంత! అనంత!

ఈ ఆరు నెలలుగా నా కళ్ళముందు అనంత, మనసులో అనంత, ఆశలో అనంత. ఒంటరిగా ఉంటోంది అనంత, డాబా ఇంటి మీద కొత్తగా వేసిన రెండు గదుల ఇంట్లో. లైబ్రరీ పుస్తకాలు ఇచ్చి పుచ్చుకోడానికి వెళ్ళాను మూడు సార్లు.

టీచరుగా స్కూల్లో చేరినప్పటినుంచీ చూస్తున్నాను. మృదువైన ప్రవర్తన,

మాటలు, నడత. ఎక్కువ మాట్లాడదు. ఐనా నా పరిచయాన్ని కాదనలేదు. స్నేహాన్ని తిరస్కరించలేదు. ప్రోత్సహించనూ లేదు. ఐనా నేనే ఈ అనుబంధాన్ని పెంచుకున్నాను. ఆశలు అల్లుకుంటున్నాను. వద్దు ఇంక ఈ బంధాలు అనుకుంటాను కానీ మనసు వినదు. దాని ఊహాగానం అది సాగిస్తూనే ఉంటుంది.

ఊహలు! ఊహలు! ఊహలు!

స్వర్గాన్ని నరకంగానూ, నరకాన్ని స్వర్గంగానూ మార్చేయగల మంత్రాలు. ముప్ఫయి ఏళ్ళ నా బ్రతుకులో ఎన్ని ఊహల కెరటాలు పడుతూ లేస్తూ వెళ్ళాయో కాని, అవి నన్నెక్కడికీ చేర్చలేదు. నన్ను అలరించే స్త్రీ మూర్తి రూపు ఊహించుకుంటూ తీరంలోనే నిలబడిపోయాను.

నేను ప్రేమించాను అనుకున్న అన్నపూర్ణ నాచదువు పూర్తికాకుండానే నాతో ఒక్కమాటైనా పలకకుండానే పెళ్ళి చేసుకొని వెళ్ళిపోయింది. ప్రేమించానని చెప్పి, పెళ్ళి కోసం కలలు గన్న మాలతి జ్వరంతో ఈ లోకం వదిలేసింది. ఇన్ని మలుపులు వచ్చినా నా స్థితి మారలేదు. గమ్యం దొరకలేదు. నా ఊహామూర్తి కోసం వెతుక్కుంటూనే ఉన్నాను. అనంత కనిపించింది స్కూల్లో, మొదట చూసినప్పుడే ఆకర్షణ కలిగింది. ఈమెలో నా కలల వెలుగులు కనిపిస్తున్నా యనుకున్నాను. ఆర్నెల్లు గడిచాక ఇప్పుడు నాకు తెలిసిపోయింది. అనంతని నేను ప్రేమిస్తున్నాను.

మొన్న పని మీద రిజిస్టర్లు చూస్తుంటే కనిపించింది, అనంత పుట్టిన రోజు. ఇవేళ! సంతోషం వేసింది తెలుసుకున్నందుకు. అందుకే సెంట్ బాటిల్ కొన్నాను. నాలో ప్రేమ కూడా అణిగి వుందని, దానిని తెరిచి నా జీవితం పరిమళ భరితం చెయ్యమని అడుగుదామని నా ఉద్దేశం.

దోవ పొడుగునా దీపాలు దాటుకుంటూ డాబా ఇల్లు చేరుకున్నాను. మెట్లు ఎక్కి పైకి వెళ్ళాను. మనసు పరిమళం నింపుకున్న సెంట్ బాటిల్లాగే ఉంది. గది ముందు వరండాలో దీపం వెలుతురులో నేనిచ్చిన పుస్తకం చదువుతున్న అనంత నేనెవరో తెలియనట్లు చూసింది. వెంటనే గుర్తు పట్టినట్లు స్నేహంగా నవ్వింది. కూర్చోమంటూ కుర్చీ చూపించింది.

''నేను రావటం మీకు అభ్యంతరమా, ఈ వేళలో'' అనడిగాను కూర్చున్నాక.

''లేదు'' అంది చీర మడతలు సర్దుకుంటూ.

''ఈవేళ మీ పుట్టిన రోజు కదూ. శుభాకాంక్షలు'' అన్నాను.

''జేబులో చెయ్యి పెట్టాను. ఇప్పుడే తీద్దామా వద్దా అని సందేహం. నా

అదృష్టం బయట పడబోతోందని భయంగానూ ఉంది.

''ఆ... ఔను. మీకెల్లాగ తెలుసు?'' అంది అనంత.

''కావాలనుకుంటే తెలుస్తాయి'' అన్నాను. చెయ్యి కాళీగా పైకివచ్చింది. ఏదో సిగ్గుగా ఉంది. కానుక ఇవ్వటానికి వెళ్ళేటప్పుడు ఇయ్యమని మనసు నిర్ధారణ చేసింది.

''పూర్తిగా తెలిస్తే మంచిదే'' అనంత నవ్వుతూ అంది.

సంతోషం వేసింది నాకు. ఆ కళ్ళలో అంత జాలి ఎందుకో అని కూడా అనిపించింది. దీన భావాల్ని దూరం చేసి ఆ స్థానంలో ఆనందాన్ని నింపెయ్యాలనే ఆరాటమూ కలిగింది.

''మీరెప్పుడూ ఒంటరిగానే ఉంటున్నారు. మీ దగ్గిరికి ఎవరూ రావటం చూడలేదు ఈ ఆర్నెల్లూ. మీకెవరూ లేరా?'' అన్నాను.

''ఔను నాకెవరూ లేరు'' అంది. నన్ను దాటి చూస్తూ.

ఇదే అవకాశం అనిపించింది.

''మీరు పెళ్ళి చేసుకోరా? ఎప్పుడు చేసుకుంటారు? ఏమీ అనుకోకండి. నేను మీ శ్రేయోభిలాషిని'' అన్నాను.

అనంత తన చూపుల్ని నా మొహం మీదికి తిప్పింది. నిశితంగా చూసింది. నేను తొణకలేదు. నా కళ్ళలో ఉన్న నిశ్చయం తెలుసుకున్నట్లుంది. తల తిప్పుకుంది. వదులుగా అల్లుకున్న జడ చెంపల మీదికి జారుతున్న జుట్టు... గీసిన బొమ్మలా ఉంది. ముగ్ధుడనై చూస్తున్నాను.

''ఇప్పుడు మీ కంటికి పాతికేళ్ళ దానిలాగ కనిపిస్తున్న నా మనసుకి నూరేళ్ళ వయసు. నా కళ్ళు... కలలు కనే కలువలని మీరనుకోవచ్చు. కానీ అవి ప్రపంచ దృశ్యాలకి చలించని గాజు గోళాలు. నిత్యం తిండి తింటూ శ్రమిస్తూ నా బ్రతుక్కి నిరీక్షణ మృత్యువొక్కటే. ఇంకా నాకు పెళ్ళి కావాలంటారా? మీరు నా శ్రేయోభిలాషినే అంటారా?'' అంది.

ఆ గులాబీ పెదవుల మీద మంచు నవ్వు చూస్తుంటే నాలో జలదరింపు కలిగింది. ఇదివరకు లేని ఉత్సుకత... సాహసం చెయ్యటానికి అవకాశం దొరికిన ఆతృత నన్ను పైకెత్తున్నాయి.

''నాకు అర్థం కాలేదు. ఇంకొంచెం వివరిస్తే కానీ... నేను ఎప్పటికీ మీ శ్రేయోభిలాషినే''

''కాఫీ తెస్తాను''

అనంత లేచి లోపలికి వెళ్ళింది.

నూరేళ్ళ వయసు!.... గాజుగోళాలు... మృత్యువు. ఈ మాటల వెనుక ఈ మగువ మనసులో ఏముంది?

మనిషి వయసెంత? మానవ చరిత్రంత!

మానవ చరిత్రకంటె నూరేళ్ళు ఎక్కువా? ఏ మనిషయినా చరిత్రని మించి జీవిస్తాడా? ఉన్నారు. ప్రవక్తలు! అనంత ప్రవక్తా? పండు ముసలా?

అనంత కాఫీ తీసుకొని వచ్చేసింది.

''నా శ్రేయోభిలాషికి, కాఫీ'' అంది. కప్పు నాకు అందించి తను కుర్చీలో కూర్చుంది.

''మీకో'' అన్నాను.

''నేను ఇన్ని సార్లు తాగను. మీరు తాగండి'' అని చూపులు మరల్చుకొని ఎటో చూస్తోంది.

''అప్పుడప్పుడు మనం మన ప్రవర్తనకి, జీవితానికి ఎవరికో సమాధానం చెప్పుకోవలసి వస్తూనే ఉంటుంది. మనకి ఏ బంధాలూ వద్దు అనుకున్నా సరే. సంఘంలో బ్రతికే మనిషి స్వతంత్రుడు కాడు.'' అని ఆగింది అనంత.

కాఫీ తాగుతూ ఏం చెప్తుందో అని చెవులు అప్పగించాను.

''ప్రేమ! ప్రేమ! ప్రేమ!... అంటూ ఎవరేనా ఉద్రేకం ప్రదర్శిస్తే నాకు చాలా చిరాకుగా ఉండేది. కోపం కూడా వచ్చేది. అటువంటి నా మీదికి కూడా ప్రేమ ఒక గంధ వాహంలా వచ్చింది జీవాధారం అనిపించి పెను తుఫాను సృష్టించి వెళ్ళిపోయింది.

ఎవ్వరైనా తొందర పడెతే క్షమించలేని స్వభావం నాది. అతడితో పరిచయం స్నేహంగా మారింది. అంత కంటే గట్టి బంధాన్ని కోరింది మనసు. పెళ్ళి చేసుకుందా మనుకున్నాం. అతను ట్రైనింగ్‌కి వెళ్ళి రావాలి. ఆరు నెలలు గడవాలి. సెలవు తీసుకోటానికి వచ్చాడు. ఆ రోజంతా మే మిద్దరమే కలిసి గడిపాం. ఇద్దరం అనిపించలేదు ఇద్దరం కలిసి ఒకటిగా ఏర్పడిపోయాం అనిపించింది. అది తొందర అనిపించలేదు, ఆనందాన్ని జారిపోనీకుండా అందిపుచ్చుకోవటం అనిపించింది. తనకి సాటి లేరని విర్రవీగే కాలాన్ని ఓడించి పరిహసించటం అనిపించింది. జీవితానికి సార్థకత అనిపించింది. అతడి పై నా ప్రేమని నిరూపించుకోవటం

అనిపించింది. ఎవరికీ దొరకని అమృతపు జల్లు నా బ్రతుకులో జాలువారినట్లు గర్వ రేఖ మెరిసింది.... అతడు వెళ్ళి పోయాడు. వెడుతూ ఆక్సిడెంటుకి గురై చనిపోయాడని వార్త వచ్చింది.

అప్పటికే నా గర్భంలో ఒక శిశువు చోటు చేసుకుందని తెలిసింది.

అంతే నా కథ. అక్కడితో పూర్తయింది.

తుఫాను అనంతరం నిలిచే నిశ్శబ్దం, నిర్వేదం నాలో మిగిలాయి. జరిగిన దానికి పశ్చాత్తాప పడటంలేదు. ఆ గర్వ రేఖ నన్ను వదలలేదు.

ఆ అవసరం నాకు రాలేదు. ఆ కథని ఇంక పొడిగించ దలుచుకోలేదు. నా కథ అప్పుడే పూర్తయింది. ఇంక నా జీవితంలో తరవాత పేజీలన్నీ ఖాళీ'' అనంత నవ్వింది. నిజంగానే ఆ నవ్వు ఖాళీగా ఉంది.

ఇందాక అది దైన్యం అనుకున్నాను. కాదు, అది నిర్జీవమైన నవ్వు.

ఐతే ఇది విరక్తి అన్న మాట. శ్మశాన వైరాగ్యం... ప్రసూతి వైరాగ్యం... ఈ కోవలో వైరాగ్యం ఎన్నాళ్ళుంటుంది?

నాలో ఒక ఆశ్చర్యం, దానితో బాటు జాలి. అనంత కోసం నేనేమైనా చెయ్యాలి. పెళ్ళి కాలేదనుకున్నాను. పెద్ద కథే ఉంది... ముందు కథ నేను నడిపించాలి.

''ఇంకా మీరు నా శ్రేయోభిలాషినే అంటారా? ఇంకా నేను పెళ్ళి చేసుకోవాలా? అని ప్రశ్నించింది అనంత నవ్వుతూ. ''ఆ పాప?''

''మా పిన్ని ఒక డాక్టర్, అవిడ దగ్గర పెరుగుతోంది. ఆవిడనే అమ్మా అంటుంది'' అనంత మొహంలో చలనం లేదు. రంగులు మారటంలేదు. ఆ మనిషిలో జీవన సమరం ఆగిపోయింది. బ్రతికి ఉండగానే.

''ఇంకా నేను మీ శ్రేయోభిలాషినే. మీరు తప్పకుండా పెళ్ళి చేసుకోవాలంటాను'' నొక్కి పలికాను.

''జీవిత చక్రం చాలా చిన్నది. చర్విత చర్వణం విసుగు కాదా? ఒకరి మీద ఆధార పడాల్సిన అవసరం లేదు. నన్ను నేను పోషించుకోగలను'' అంది.

''పుట్టటం, పెరగటం, మరణించటం అనే చక్రం చాలా పరిమితమైనదే కావచ్చును. కానీ మనసు, ఆలోచనలు, ఉద్రేకాలు, ఆశలూ ఈ పరిమితిని ఛేదించేస్తున్నాయి. అనంతంగా చేస్తున్నాయి. ఈదలేని లోతుల్ని సృష్టిస్తున్నాయి. ఎంతో బ్రతుకు ముందు ఉంది, ఏడాదికి మూడువందల అరవై ఐదు రోజులు.

రోజుకి ఇరవై నాలుగు గంటలు. గంటకు అరవై నిముషాలు. క్షణం క్షణం మీరలా గడపటం దుర్భరం... అర్థం లేని పని. ఫలితం లేని పోరాటం. నా జీవితంలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. నా మీద నాకు విశ్వాసం ఉంది... మిమ్మల్ని సుఖ పెట్టగలనని. పెళ్ళి చేసుకుంటాను

"ఉహు. వద్దు. క్షమించండి."

"ఎందుకని? నువ్వు విప్లవాత్మకంగా మాట్లాడతావు. వితంతు వివాహాన్ని కూడా సమర్థిస్తావు. నీ విషయం వచ్చేసరికి... పిరికితనమా..."

నా మాటలు వింటూ రెండు క్షణాలు కళ్ళు మూసుకుంది అనంత. మనసులోని బాధ సంఘర్షణ బయట పడనీయకూడ దనుకుం దేమో!

కళ్ళు తెరిచి నన్ను చూసి నవ్వుతూ

"నాకు కాషాయగుడ్డలు కట్టుకోవాలని లేదు కాని మీ అందరికీ నేను మీ మధ్య ఉండటం ఇబ్బందిగా ఉంటే... కట్టుకుంటాను" అంది.

మౌనంగా మెట్లు దిగి వచ్చాను.

కోరికలు! కోరికలు! కోరికలు!

ఎంత సేపూ నాకు కావలసినవి ఆలోచనలే... మనసునీ, శరీరాన్నీ కాల్చేస్తూ జీవితాన్ని భస్మం చేస్తూ. ఎదుటి మనిషిని గురించి ఆలోచించనివ్వవు. ఆ కథ విన్నాక మరింత జాలి నిండిపోయింది. ఎట్లాగైనా ఆరాధించో... అనునయించో నాదాన్ని చేసుకోవాలనే అనుకున్నాను. కానీ అనంత అవకాశం ఇవ్వలేదు. ఒక్క సారికే తీరిపోయిందా అనంతకి దాహం? నాకు నమ్మకం లేదు. ఎప్పటికైనా మారుతుంది. కానీ ఏం లాభం? సెంట్ బాటిల్ నా జేబులోనే ఉండిపోయింది. ఎప్పుడైనా ఇద్దాం అనుకుంటుండగానే అనంత ట్రాన్స్ ఫరై వెళ్ళిపోయింది.

మనసులో మళ్ళీ నిరీక్షణ ... ఏనాటికో.... ఎవరో... నాకు తగిన వ్యక్తి....

అనంతకి ఒక్క సారికే దాహం తీరిపోయింది. నాలో తీరని దాహం!

మనిషికి మనిషికి ఎంత తేడా?

ఉహు. నాకూ అనంతకీ ఎంత తేడా.

* * * *